క్లుప్తంగా

హెచ్ఎంకు ప్రశంసాపత్రం



కొడవలూరు : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'యుట్యూబ్ బడి విద్యా సమాచార చానల్' ఆధ్వర్యంలో మాతృ భాషపై మంగళవారం ఆన్‌లైన్‌లో క్విజ్ నిర్వహించారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.వెంకటేశ్వర్లు క్విజ్‌లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో చానల్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో బుధవారం ప్రశంసా పత్రం పంపారు. దీంతో హెచ్ఎంను ఎంఈఓ జి.వసంతకుమారి అభినందించారు.

కస్తూర్బా గాంధీకి ఘన నివాళి



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కస్తూర్బా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి విద్యార్థులు, ఆశ్రమ కమిటీ సభ్యులు బుధవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కస్తూర్బా సేవలను గుర్తుచేసుకున్నారు. తొలుత మహాత్మ గాంధీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల, స్వాతి, ఉపాధ్యాయిని రేవతి పాల్గొన్నారు.

26న జిల్లాస్థాయి చెస్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం : ఈనెల 26న జిల్లాస్థాయిలో ఓపెన్ అండర్–11, అండర్–13, మహిళల జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.మస్తాన్ బాబు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కోవూరులోని శ్రీచైతన్య స్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 98481 47889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డ్రైయిన్ల నిర్మాణం.. సమస్యకు పరిష్కారం

• మరుపూరు వాసుల ఆనందం



మరుపూరు బీసీ కాలనీలో నిర్మించిన సైడ్‌డ్రెయిన్

పొదలకూరు : మండలంలోని మరుపూరు బీసీ కాలనీలో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణంతో చాలా కాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లు అయింది. ఇటీవల మరుపూరు గ్రామ సచివాలయం పరిధిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బీసీకాలనీకి చెందిన వారు తమకు సైడ్‌డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను అంచనాలు రూపొందించి నిర్మించాల్సిందిగా ఆదేశించారు. దీంతో కాలనీలో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయించారు. బీసీ కాలనీ వాసులు ఈ సందర్భంగా మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

పొదలకూరులో విషాదఛాయలు

పొదలకూరు : నెల్లూరులో అనుదీప్ హత్యకు గురికావడంతో బుధవారం పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పట్టణానికి సమీపంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన అనుదీప్ ఇటీవలే బుజబుజనెల్లూరుకు మారాడు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన అనుదీప్ అందరికీ సుపరిచితుడు. వెటరన్ క్రీడాకారులతో సైతం సఖ్యతగా ఉండేవారు. దీంతో స్థానిక వినాయక షటిల్ క్లబ్ నిర్వాహకులు వి.లక్ష్మీనారాయణ, బీపీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి

తోటపల్లిగూడూరు : ఈ–పంట నమోదుకు ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉందని, రైతులు త్వరగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ సాగుకు సంబంధించి ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ–పంట నమోదు తప్పనిసరి అని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 9,500 ఎకరాల్లో ఈ–పంట నమోదు జరిగిందని, 2,257 మందికి గాను 2,070(91 శాతం) మంది ఈ–కేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం..

పేదలకు ధైర్యం

• మారిన సీహెచ్‌సీ రూపురేఖలు
• తీరిన డాక్టర్ల కొరత
• రోగులకు భోజనం ఏర్పాటు
• ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు సన్నాహాలు



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

పొదలకూరు : గతంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తి సామాన్య ప్రజలు ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్ల సంగతి దేవుడెరుగు పగటి వేళల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. మెడికో లీగల్ కేసులను చూడాల్సిన డాక్టర్లు లేక పోలీసులు సైతం ఇబ్బందులు పడేవారు. మందులు, పరికరాల కొరతతో డాక్టర్లు ఇక్కడికి రావాలంటే విముఖత చూపేవారు. అయితే వాటికి భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీకి చైర్మన్ అయిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి చాలా మార్పులు తీసుకొచ్చారు. మందులు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కోవిడ్ కష్టకాలంలో ఇక్కడ కరోనా సెంటర్‌ను ఏర్పాటు చేయించి ఎందరో ప్రాణాలను కాపాడారు. ప్రాథమికంగా ఆక్సిజన్‌ను అందించేందుకు దాతల సహకారంతో కాన్సంట్రేటర్లను సీహెచ్‌సీకి అందజేశారు. ఫలితంగా గతేడాది సీహెచ్‌సీకు కాయకల్ప చికిత్స అవార్డు కూడా వరించింది.

వైద్యుల నియామకం

గత ప్రభుత్వంలో పొదలకూరులో సీహెచ్‌సీను ఏర్పాటు చేసినా డాక్టర్ల నియామకం జరగకుండానే కాలం వెళ్లదీశారు. ఫలితంగా పేరుకు సామాజిక ఆరోగ్య కేంద్రం అయినా పేదలకు వైద్యం సక్రమంగా అందేది కాదు. ప్రస్తుతం వైద్యులు, నర్సుల సంఖ్య పెరిగి పేదలకు వైద్యం అందుతోంది. అంతేకాక ఇక్కడ ఇన్‌పేషెంట్‌గా చేరేవారికి, గర్భిణులకు భోజనం కూడా ఏర్పాటు చేస్తున్నారు. గర్భకోశ వ్యాధినిపుణులు ఒకరు, చిన్నపిల్లల వైద్యనిపుణులు ఒకరు, మత్తు వైద్యుడు ఒకరు, దంత, ఫిజియోథెరపి ఒక్కొక్కరు, కాంట్రాక్ట్ డాక్టర్ ఒకరు, వైఎస్సార్ కంటి వెలుగు కింద అప్తాలమిస్టు ఒకరు, స్టాఫ్ నర్సులు ఏడు మంది ఉన్నారు. ఇద్దరు సర్జన్లను నియమించాల్సి ఉంది. ఫలితంగా ఓపీ పెరుగుతున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు.

తంచన్‌గా నైట్‌డ్యూటీలు

పట్టణంలో ప్రైవేటు డాక్టర్లు రాత్రి 7 తర్వాత ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో చట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే సీహెచ్‌సీలో రాత్రివేళల్లో సేవలు అందించేందుకు ఒక డాక్టర్, ఒక నర్సు, ఒక అటెండర్ అందుబాటు ఉంటున్నారు. ఫలితంగా రాత్రి వేళల్లో అత్యవసరంగా వచ్చే వారికి వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రాథమిక వైద్యం చేయించుకుని అవసరాన్ని బట్టి కొందరు నెల్లూరు నగరానికి వెళ్తున్నారు. రాత్రివేళ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పెద్ద మార్పుగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంక్ అవసరం

ఆస్పత్రిలో ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంకు అవసరమని ప్రజలు వెల్లడిస్తున్నారు. గర్భిణులు, బాలింతలే కాకుండా రోడ్డు ప్రమాదాలకు గురయ్యే వారికి రక్తం అవసరం అవుతోంది. నెల్లూరు నగరానికి వెళ్లేలోపు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఐదు మండలాలకు ప్రధాన కూడలిగా ఉన్న ఇక్కడి సీహెచ్‌సీలో రక్తనిధి ఏర్పాటు అవసరం ఉంది. ఇదే అంశాన్ని మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ నిధులు కూడా ఉన్నందున బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు అవకాశం ఉంది.

24 గంటల పాటు వైద్యసేవలు



సీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రాత్రి వేళల్లో ఒక డాక్టర్, నర్సు వైద్యసేవలను అందించేందుకు ఉంటారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ వల్ల సీహెచ్‌సీలో చాలామార్పులు జరిగాయి. బ్లడ్ బ్యాంక్, ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

– డాక్టర్ పద్మావతి, ప్రధాన వైద్యాధికారి, సీహెచ్‌సీ, పొదలకూరు.

ఎంఎల్‌హెచ్‌పీని సరెండర్ చేయండి

• నోడల్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్



వివరాలు తెలుసుకుంటున్న నోడల్ ఆఫీసర్ దయాకర్

పొదలకూరు: విధులు సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా ఉంటున్న మండలంలోని తాటిపర్తి–1 హెల్త్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ చంద్రమౌళిని డీఎంహెచ్ఓకు సరెండర్ చేయాలని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్ దయాకర్ మండల వైద్యాధికారి రమేష్‌ను ఆదేశించారు. తాటిపర్తి–1 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ రికార్డులను రాయడం లేదని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా పరికరాలు, మందులను సరైన పద్ధతిలో ఉంచుకోలేదని నోడల్ ఆఫీసర్ గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్ల ద్వారా పేదలకు వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. హెల్త్ సెంటర్లను సక్రమంగా నిర్వహించకుంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నోడల్ ఆఫీసర్ వెంట మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



కోవూరు, బుచ్చి సీఐలను సన్మానిస్తున్న చలపతిరావు

కొడవలూరు : ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయని, ఇందుకు అధికార యంత్రాంగం చేసిన కృషి ప్రశంసనీయమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కొనియాడారు. మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగ్గా, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన వివిధ శాఖల అధికారులను ఆలయ ప్రాంగణంలో బుధవారం చలపతిరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి పోలీసు యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా జరిగేందుకు ఎంతో కృషి చేశారన్నారు. నెల్లూరు గ్రామీణ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పర్యవేక్షించడంతో పాటు ప్రత్యేకంగా ఒక అడిషనల్ ఎస్పీని, డివిజన్‌లోని పోలీసు యంత్రాంగాన్ని కేటాయించిన జిల్లా ఎస్పీ విజయారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నిశాఖల అధికారులు వారి వంతు సహకారం అందించడం ద్వారానే ఉత్సవాలు విజయవంతమయ్యాయని స్పష్టం చేశారు. సన్మానం పొందిన వారిలో బుచ్చి, కోవూరు సీఐలు జి.రామారావు, కె.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం, ఆలయ ఈఓ బి.శాంతయ్య, అర్చకులు బి.సుబ్రమణ్యం, సి.హరిప్రసాద్, పాలక మండలి సభ్యులు బాబురావు, శీనమ్మ, చెన్నమ్మ, వెంకటరమణమ్మ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అమలు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నేత వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకాణికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో తిరుగుతుంటే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందుతున్నట్లు తెలుస్తోందన్నారు.

ఒక్క పథకమైనా అమలు చేశారా?

45 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఒక్కటైనా అమలు చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదని మంత్రి కాకాణి ప్రశ్నించారు. చంద్రబాబు తనది అని చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదన్నారు. ఆయనతో పాటు ఓ వర్గం మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజల గురించి ఆలోచన చేశారు కాబట్టే జగన్‌మోహన్‌రెడ్డి ఇన్ని సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అమలు చేయగలుగుతున్నారని తెలిపారు. పాలకుడు మంచి వాడైతే ప్రకృతి కూడా సహకరిస్తుందని, దీనికి చంద్రబాబు హయాంలో కరువు కాటకాలు, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే సమృద్ధిగా వర్షాలు కురవడమే నిదర్శనమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుంటే తమపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు నాయకులు, మీడియా గోతికాడ నక్కలా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే వారి ఆశలు ఫలించవని, ఎన్నడూ లేనంత అధిక ధరలకు రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో పనిచేసిన అందరూ ఎమ్మెల్యేల కన్నా తాను ఎక్కువగా అభివృద్ధి చేశానన్నారు. దీనిపై చర్చకు సిద్ధమని, లేదని నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. అందరు నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే వెంకన్నపాళెంలో టీడీపీకి డిపాజిట్ కూడా రాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు ఆడపాల శివకుమార్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, గుండాల ఆదినారాయణ, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, చిట్టమూరు రాజశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, యూఎస్‌కే రెడ్డి, కానంపూడి సురేంధర్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఏడుకొండలు, మహేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

బంగారు చైన్ బహూకరణ



బంగారు చైన్‌ను బహూకరిస్తున్న దాతలు



నిత్యాన్నదానానికి రూ.లక్ష నగదును అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారికి దాతలు బుధవారం బంగారు చైన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన గండవరపు సునీత ఆలయంలో జరిగే శ్రీవార్ల నిత్య కల్యాణం కోసం ఉత్సవ మూర్తులను అలంకరించేందుకు 8 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారు చైన్‌ను అందజేసినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు.

అన్నదానానికి రూ.లక్ష

ఆలయంలో జరిగే నిత్య అన్నదానానికి దాతలు బుధవారం రూ.లక్ష నగదును అందజేశారు. ఆలయ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన అరుగుంట హరికిశోర్ రెడ్డి, శరణ్‌కుమార్‌రెడ్డి కలిసి రూ.లక్ష నగదును అందజేసినట్లు తెలిపారు. అనంతరం దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రామపటం



రేబాల గ్రామపటాన్ని వేసిన వ్యవసాయ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం : శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం రేబాలలో వేసిన గ్రామపటం పలువురిని ఆకట్టుకుంది. మండలంలోని రేబాలలో సాగుపై పరిశోధన చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్థానికంగా జిల్లా ఏరువాక ఆధ్వర్యంలో రేబాల గ్రామపటాన్ని తీర్చిదిద్దారు. ఇందులో గ్రామంలోని సచివాలయం, పాఠశాల, పీహెచ్‌సీ, తాగునీటి పథకాలతో పచ్చని పొలాలు, చేపల గుంతలు, మత సంస్థలు, మౌలిక వసతులతో గ్రామీణ నేపథ్యాన్ని భాగస్వామ్యం చేస్తూ వేసిన పటం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఓబయ్య, శాస్త్రవేత డాక్టర్ సురేఖాదేవి, వ్యవసాయశాఖ విస్తరణాధికారులు అనిత, పవన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రిగ్ పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో సర్వేపల్లి జోన్ 98వ గ్రిగ్ మెమోరియల్ గేమ్స్‌లో భాగంగా రెండోరోజు బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, హాకీ, హ్యాండ్‌బాల్, ఫుట్ బాల్ పోటీలను నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు ప్రభగిరిపట్నంలో 'గడప గడపకు..'

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామంలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

రేపు ఉద్యాన నర్సరీలో బహిరంగ వేలం

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి వద్ద ఉన్న ఉద్యాన నర్సరీలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ మండల అధికారిణి వై.ప్రేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలో ఉన్న 600 మామిడి చెట్లు, 22 ఉసిరి చెట్లు, 20 సపోట, రెండు పనస చెట్లకు సంబంధించి ఫలసాయం హక్కుల కోసం వేలం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 చెల్లించి వేలంలో పాల్గొన వచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం ఉద్యానవన శాఖ అధికారిణి ఫోన్ నంబర్ 79950 86940కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. కోవూరు మండలం ఇనమడుగు దళితవాడకు చెందిన దుగ్గులూరు పవన్ (20) ట్రాక్టర్‌లో కట్టెలలోడుతో కొడవలూరు మండలం రేగడిచెలికలోని క్రెబ్స్ ఫ్యాక్టరీకి మంగళవారం రాత్రి బయలుదేరాడు. నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి వద్ద వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో పవన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్‌లో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై జి.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని జింక మృత్యువాత

వెంకటాచలం: లారీ ఢీకొని జింక మృతిచెందిన ఘటన వెంకటాచలం – తిక్కవరప్పాడు గ్రామాల మధ్యలో బుధవారం ఉదయం జరిగింది. వివరాలు.. వెంకటాచలం నుంచి కృష్ణపట్నం వైపు వెళ్తున్న లారీ రోడ్డు దాటుతున్న జింకను ఢీకొనడంతో అది తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోయింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని దహనం చేశారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ వేదికపై కొలువైన స్వామి, అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వధూవరులైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గజవాహనంపై స్వామివారు

ఉత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా రామిశెట్టి భాస్కర్‌రావు జ్ఞాపకార్థం రామిశెట్టి రమణమ్మ, కుమారులు మురళీకృష్ణ, మోహన్‌బాబు, కల్యాణ్ కుమార్ వ్యవహరించారు.

సీసీ కెమెరాల పనితీరు పరిశీలన



సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి వరప్రసాద్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్నాయని, వాటిని ఆకస్మికంగా పరిశీలించిన అనంతరం పరీక్ష కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ఆయన వెంట డీఈసీ సభ్యులు వేణుగోపాల్, చీఫ్ సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

ముత్తుకూరులో డీపీఓ విచారణ



విచారణ చేస్తున్న డీపీఓ, డీఎల్‌పీఓ తదితరులు

ముత్తుకూరు : స్థానిక పంచాయతీ కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించిన తనపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ బీజేపీ మైనార్టీ మోర్చా నేత షేక్ షఫీఉల్లా ఇటీవల జాతీయ మైనార్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలంటూ మైనార్టీ కమిషన్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ చిరంజీవి, డీఎల్‌పీఓ విజయకృష్ణ తదితరులు బుధవారం సచివాలయం –1లో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు, పనులకు సంబంధించిన టెండర్లు తనిఖీ చేశారు. అటు ఫిర్యాదుదారుడు షఫీఉల్లా, ఇటు పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ వర్గీయులు, వార్డు సభ్యుల వాదనలు, వాదోపవాదాలు, ఫిర్యాదులు సమగ్రంగా ఆలకించారు. దీనిపై నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని డీపీఓ వెల్లడించారు.